క్లుప్తంగా

కొనసాగుతున్న వెంకన్న బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు రెండోరోజు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు యెరబాటి రాజేశ్వర్‌రావు, హైకోర్టు న్యాయవాది అశోక్‌రావు దంపతులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రఘుపతిరావు, కిషన్‌రెడ్డి, మెట్టు శ్రీశైలం, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు పరామర్శ



లక్ష్మణ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయ్

పెద్దపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు బుధవారం పరామర్శించారు. ఆయన యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

జాతర ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎంపీవో సమ్మిరెడ్డి

రామగుండం: అంతర్గాం మండలం గోలివాడ సమ్మక్క – సారలమ్మ జాతర ఏర్పాట్లను ఎంపీడీవో అలీం వివిధ శాఖల ఉద్యోగులు, అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్నారు. ఎంపీవో సమ్మిరెడ్డి, గోలివాడ ప్రత్యేకాధికారి స్వరూపరాణి, జాతర కమిటీ చైర్మన్ పెంద్రు హన్మాన్‌రెడ్డి, వైస్ చైర్మన్ కోల రామ్మూర్తిగౌడ్, ఆవుల గోపాల్‌యాదవ్, పల్లికొండ తిరుపతి తదితరులు పాల్గొంటున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న శంకర్

మంథని: ఎక్లాస్‌పూర్‌లో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన రెండు రోడ్ల పనులను ఎంపీపీ కొండ శంకర్ బుధవారం ప్రారంభించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇటీవల మంజూరు చేయించిన నిధులతో ఈ పనులు చేపట్టారు. పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎంపీటీసీ చైతన్య ప్రభాకర్, మాజీ సర్పంచ్ చెన్నవేన సదానందం, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

చెట్ల నీడే పార్కింగ్ స్థలం



గేట్ ఎదుట వాహనాల పార్కింగ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ ప్రాజెక్టు గేట్ వద్ద ఖాళీ స్థలంలో పార్కింగ్ షెడ్ నిర్మిస్తే కాంట్రాక్టు కార్మికుల వాహనాలకు భద్రత ఉంటుందని పలువురు కోరుతున్నారు. అయితే, గేటు ఎదుట చెట్ల నీడన పార్కింగ్ చేస్తే వాహనాలు చోరీకి గురయ్యే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలకు పార్కింగ్ షెడ్ కట్టించాలని పలువురు కార్మికులు యాజమాన్యాన్ని వేడుకుంటున్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి



సమావేశమైన ఎంపీపీ స్రవంతి

పెద్దపల్లిరూరల్: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ బండారి స్రవంతి కోరారు. బదిలీపై వచ్చిన ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బందితో బుధవారం ఆమె సమావేశమై పలు సూచనలు చేశారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్న దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



ఎలిగేడు: సారలమ్మను గద్దెపైకి తీసుకొస్తున్న కోయపూజారులు

శివసత్తుల పూనకం.. ఎత్తు బంగారం

పెద్దపల్లి రూరల్: శివసత్తుల పూనకాలు.. నిలువెత్తు బంగారం(బెల్లం)తో వేలాది మంది భక్తులు సమ్మక్క – సారలమ్మ జాతరకు తరలివచ్చారు. బుధవారం సాయంత్రం సారలమ్మ గద్దెకు చేరుకోవడంతో భక్తజనం పులకించిపోయింది. కోయపూజారుల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లోని చిలుకల గుట్ట నుంచి అమ్మవారు బయలుదేరి గద్దెకు చేరుకుంది. హన్మంతునిపేట తదితర ప్రాంతాల్లో జాతర వైభవంగా సాగుతోంది.

ఎలిగేడులో..

ఎలిగేడు: లాలపల్లి–ఎలిగేడు సరిహద్దులోని పెండ్లిపోరుగుట్ట సమ్మక్క–సారలమ్మ జాతరలో సారలమ్మను డప్పు, చప్పుళ్లతో కోయపూజారులు గద్దెకు తీసుకొచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కవ్వంపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శిగా అమ్ముల కుమారస్వామి, కోశాధికారి భూర్ల సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్: గుండారంలోని సమ్మక్క– సారలమ్మ జాతరలో భాగంగా సారలమ్మను కోయపూజారుల సారథ్యంలో గద్దెపైకి తీసుకొచ్చారు. భక్తులు ఒక్కసారిగా పూనకాలతో ఊగిపోయారు. భక్తులు మొక్కులు చెల్లించారు. ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేశారు.

జూలపల్లిలో..

జూలపల్లి: అబ్బాపూర్, తేలుకుంట సమక్క–సారలమ్మ జాతరలో తొలి ఘట్టం ప్రారంభమైంది. కోయ పూజాలరుతో సారలమ్మ గద్దెపైకి చేరారు. జాతర కమిటీ ప్రతినిధులు పసునూటి శ్రీనివాస్, చొప్పరి శేఖర్, శ్యాం, లక్ష్మీనారాయణ, చంద్రయ్య, రాజేశం, ధర్మయ్య పాల్గొన్నారు.

కొలుదుదీరిన వనదేవత

ధర్మారం: కటికెనపల్లి, ఎర్రగుంటపల్లి, కొత్తూరు, మేడారం, దొంగతుర్తి తదితర గ్రామాల్లో సారలమ్మ గద్దెకు చేరుకున్నారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: సాలతక్కళ్లపల్లి, వేంనూర్, రాణాపూర్ శ్రీసమ్మక్క–సారలమ్మ జాతరలో భక్తులు పోటెత్తారు. జాతర కమిటీల ఆధ్వర్యంలో సారలమ్మను గద్దెకు తీసుకొచ్చారు. ఎస్సై స్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.



ఖనిలో అమ్మవారిని గద్దెకు తీసుకొస్తున్న పూజారులు



గోదావరిఖనిలో కోయపూజారుల పూజలు



ఓదెల : పూజలు చేస్తున్న భక్తులు



ధర్మారం: గుట్ట పైనుంచి వస్తున్న సారలమ్మ



గోదావరిఖని : పూజారుల ఎదుట పొర్లుదండాలు



సుల్తానాబాద్‌రూరల్ : నీరుకుల్లలో భక్తుల రద్దీ



రామగుండం : గోలివాడలో స్పృహతప్పిన పూజారి



గోదావరిఖనిలో భక్తుల కోలాహలం



పాలకుర్తి : సారలమ్మను తీసుకొస్తున్న పూజారులు



పెద్దపల్లిరూరల్ : ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీపీ కృష్ణ



కమాన్‌పూర్ : గద్దెకు వస్తున్న సారలమ్మ



గద్దెపై సారలమ్మ..

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న సతీశ

పెద్దపల్లి రూరల్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదేశాల మేరకు ఆర్టీఐ విభాగానికి స్టేట్ కో ఆర్డినేటర్‌గా జిల్లాకు చెందిన కొండి సతీశ్‌ను నియమించారు. ఈమేరకు రాష్ట్ర చైర్మన్ ఎస్.నరేశ్ బుధవారం నియామకపత్రం జారీచేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ద్వారా కొండి సతీశ్ ఆ నియామకపత్రం అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివాసేనారెడ్డి, స్టేట్ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సయ్యద్ ఖాలీద్, సురాభీ ద్వివేదీ తదితరులకు సతీశ్ కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి పనులు పునరుద్ధరణ



పనుల వద్ద ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం: పట్టణంలోని ఎస్టీ కాలనీ సమీప కబ్రస్తాన్ వద్ద రహదారి పునరుద్ధరణ పనులను బుధవారం రాత్రి చేపట్టారు. గోలివాడ సమ్మక్క జాతరకు వందలాది మంది భక్తులు తరలివెళ్లనున్న నేపథ్యంలో ఈ మార్గంలోని గుంతలు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. భక్తులు ప్రత్యామ్నాయంగా పెద్దంపేట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఫలితంగా దూరభారం పెరుగుతోంది. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ఆదేశాలతో గుంతలను పూడ్చే పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ప్రాజెక్టు అధికారితో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారి మధుసూదన్‌ను కలిశారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి, వడ్డేపల్లి దాస్, వికాస్‌కుమార్, అక్రం, కొత్త సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, శంకర్‌నాయక్, ఎట్టం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలి



శివకాంత్ రవిని సన్మానిస్తున్న సుధాకర్‌రావు

రామగిరి: ఉద్యోగ విరమణ తర్వాత శేష జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు ఆకాంక్షించారు. సర్వే జీఎం పి.శశికాంత్ రవి ఈ నెల 29న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈసందర్భంగా జీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో సుధాకర్‌రావు మాట్లాడారు. ఏపీఏ ఇన్‌చార్జి జీఎం నాగేశ్వరరావు, ఏరియా ఇంజినీర్లు ఏలీషా, సీతారామం, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఏరియా సేఫ్టీ అధికారి వెంకటరమణ, సర్వే అధికారి జైనాలాబద్దీన్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, పర్యావరణ అధికారి రాజారెడ్డి, సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ, ఐటీ రాజేశ్వరి, ఎస్టేట్స్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్ లేనిభూముల్లో హద్దురాళ్ల తొలగింపు



హద్దురాళ్లు తీసుకెళ్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: వ్యవసాయ భూములను ఇష్టానుసారంగా ప్లాట్లుగా మార్చి విక్రయిస్తే అందులో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబోమని మండల పరిషత్ అధికారి సుదర్శన స్పష్టం చేశారు. రాఘవాపూర్ గ్రామ శివారులో లే అవుట్ అనుమతులు పొందకుండానే ఏర్పాటు చేసిన ప్లాట్లలో బుధవారం సిబ్బంది హద్దురాళ్లను తొలగించారు. ప్లాట్లుగా మార్చిన పూదరి శ్రీనివాస్‌కు నోటీసులు జారీచేసినట్లు ఆయన పేర్కొన్నారు. లే అవుట్ లేని భూములను ఎవరూ కొనుగోలు చేసి ఇబ్బందులకు గురికావొద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

కమిషనర్‌కు సన్మానం

సుల్తానాబాద్: మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్‌ను పద్మశాలీ సంఘం నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. పట్టణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పూసాల పద్మశాలీ సంఘం నాయకులు వల్సభాస్కర్, వల్స రాజమౌళి, పెగడ ఆంజనేయులు, పెగడ శ్యామ్, నల్ల వెంకటేశం, ఎలుగం శ్రీనివాస్, వల్స శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

టీ షర్టులు పంపిణీ

ఓదెల: కొలనూర్ సమ్మక్క – సారలమ్మ జాతరలో సేవలు అందిస్తున్న వలంటీర్లకు పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం టీషర్టులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ దేవిడి శ్యాంరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి బైరి రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బెల్లం విక్రయాలు

కాల్వశ్రీరాంపూర్: పలువురు భక్తులు ఎత్తు బంగారం(బెల్లం) కోసం దుకాణాల ఎదుట బారులు తీరారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చి బెల్లం కొనుగోలు చేసి తీసుకెళ్లారు. సమ్మక్క – సారలమ్మకు పూజలుచేసి దేవునికి నైవేద్యంగా సమర్పించారు. ఆ తర్వాత అందరికి పంచిపెట్టారు.

25న ప్రత్యేక పూజలు

ఎలిగేడు: స్థానిక శ్రీకోదండ రామాలయంలో ఈనెల 25న చండీయజ్ఞం, శ్రీమద్భగవద్గీత యజ్ఞసహిత సప్తప్రహరణ సంకీర్తన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, శివరామ దేవస్థాన కమిటీ తెలియజేసింది. భక్తులు హాజరు కావాలని కోరింది.

బస్టాండ్‌లో అన్నదానం

మంథని: మేడారం భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నారు. ఆర్డీవో హనుమానాయక్, ఎంపీపీ కొండ శంకర్‌తోపాటు పలువురు అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. రెండురోజుల పాటు అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వసతులు కల్పించాలి

పెద్దపల్లిరూరల్: ఇటుకబట్టీలు, పరిశ్రమల్లో పనిచేసేందుకు వచ్చే వలస కూలీలకు కనీస వసతులు కల్పించాలని సీపీఎం ఏరియా కార్యదర్శి సీపెల్లి రవీందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. నిబంధనలను పాటించని పరిశ్రమలు, ఇటుకబట్టీల యజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు సందీప్, నవీన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రంథాలయం ప్రారంభం

ముత్తారం: ఓడేడ్‌లో గురువారం గ్రంథాలయం ప్రారంభిస్తారని ఎంపీడీవో లలిత తెలిపారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఈ కార్యక్రమాన్ని ఉదయం 10గంటలకు ప్రారంభిస్తారని వివరించారు.

నీటి వసతి కల్పించాలని వినతి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి గ్రామ శివారులోని గోదావరి నది ఒడ్డున వైకుంఠధామానికి నీటివసతి కోసం బోరువెల్ ఏర్పాటు చేయాలని, రోడ్డు సౌకర్యం కల్పించాలని కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ కోరారు. ఈమేరకు రామగుండం మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం వినతి పత్రం అందించారు. స్పందించిన కమిషనర్ శ్రీకాంత్.. ఎన్టీపీసీ సీఎస్సార్ అధికారులకు లెటర్ ద్వారా వైకుంఠధామానికి నీటి వసతితోపాటు పలు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

తాగునీరు సరఫరా చేయాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ ప్రాజెక్టు రోడ్డులోని పోచమ్మ ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉందని, సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా రద్దీ మరింత పెరిగిందని స్థానికులు కోరారు. ఈమేరకు అధికారులు స్పందించి ఆలయానికి ఉన్న నీటిపంపు ద్వారా తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని వారు వేడుకుంటున్నారు.

డైరీ ఆవిష్కరణ

రామగుండం: స్థానిక బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలోని సూపరింటెండెంట్ ఇంజినీర్ విజేందర్ తన చాంబర్‌లో బుధవారం తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్, తెలంగాణ స్టేట్ పవర్ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్లు శంకరయ్య, శ్రీనివాస్‌రావు, శ్రీవాణి, అనిల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించాలి

గోదావరిఖని: సంస్థ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో సమష్టిగా ముందుకు సాగాలని సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఓసీపీ–3ను వ్యూపాయింట్ ద్వారా పరిశీలించారు. ఉత్పత్తి పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు ఆదేశాలు జారీచేశారు. ఓసీపీ–3 డ్రాగ్ యంత్రం పనితీరును పరిశీలించారు. డైరెక్టర్ వెంట ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ, ప్రాజెక్టు అధికారి మధుసూదన్ తదితరులు ఉన్నారు.

24న విజయసంకల్ప యాత్ర

గోదావరిఖని: బీజేపీ విజయసంకల్పయాత్ర పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 24న రామగుండం నియోజకవర్గంలో యాత్ర కొనసాగుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, నాయకులు గాండ్ల ధర్మపురి, కోమల్ల మహేశ్, కొండపర్తి సంజీవ్, కొమ్మల స్వామి తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి ఓసీపీ సందర్శన

గోదావరిఖని: బొగ్గు నిల్వలు తరిగిపోయి మూసివేసిన మేడిపల్లి ఓసీపీని కేంద్ర ఎన్విరాన్‌మెంట్ అడ్వజరీ(ఈఏసీ) కమిటీ బుధవారం సందర్శించింది. ఓసీపీలో చేపట్టాల్సిన రెమిడేషన్ ప్లాన్‌లను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ తదితర విషయాలపై చర్చించారు. కమిటీ చైర్మన్ శరద్‌సింగ్ నేగి, లలిత్‌కపూర్, మహిపాల్‌సింగ్, తరుణ్, హరీశ్ కుమార్‌తోపాటు సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ జీఎం జేవీఎల్ గణపతి, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆయన కళ్లు సజీవం

కోల్‌సిటీ: గోదావరిఖని కల్యాణ్‌నగర్‌కు చెందిన చెన్నూరి రాయమల్లు(74) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి కుమారుడు మురళి అంగీకారం మేరకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాయమల్లు నేత్రాలను ఎల్వీప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ సేకరించి, హైదరాబాద్‌కు తరలించారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన

పాలకుర్తి: ఈసాలతక్కళ్లపల్లి శివారులోని శ్రీసమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణయాదవ్ బుధవారం పరిశీలించారు. ఆయన వెంట సీఐ కృష్ణ, బసంత్‌నగర్ ఎస్సై స్వామి, పాలకుర్తి వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, నాయకులు మల్లెత్తుల శ్రీనివాస్, ముల్కల కొంరయ్య, తిరుపతి తదితరులు ఉన్నారు.

ఓటు నమోదుకు అవకాశం



ఓటర్లు

సుల్తానాబాద్(పెద్దపల్లి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్ల వయసు నిండిన వారు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఇందుకోసం స్వీప్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 7,17,682 మంది ఓటర్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నారు. మరోసారి నమోదుకు అవకాశం ఉన్నందున అర్హులైన యువత తమ పేర్లు నమోదు చేసుకోవాలని డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

నేత్రదానంపై అపోహలు వీడండి



అభినందనపత్రం అందిస్తున్న లింగమూర్తి

కోల్‌సిటీ: మరో ఇద్దరికి వెలుగులు ప్రసాదించే నేత్రదానంపై అపోహలు వీడాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి కోరారు. గోదావరిఖని హనుమాన్‌నగర్‌లో ఈనెల 11న అకాల మరణం చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కొయ్యల ఎల్లయ్య నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో స్వీకరించారు. ఈ సందర్భంగా బుధవారం నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించారు. లింగమూర్తి, జిల్లా అధ్యక్షుడు అరెపల్లి రాజమౌళి, రాష్ట్ర ప్రతినిధులు కేఎస్ వాసు, గోదావరిఖని పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నేత్రదానం, అవయవ దానం, దేహదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. నేత్రదాత కుటుంబ సభ్యులను అభినందించారు.

వీధికుక్కలను నియంత్రించండి



వినతిపత్రం అందిస్తున్న బూర్ల శ్రీనివాస్

ఫెర్టిలైజర్‌సిటీ: లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం రాత్రి మేకల అనుశ్రీపై వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం 'సాక్షి'లో 'వీధికుక్కల దాడిలో చిన్నారికి గాయాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బూర్ల శ్రీనివాస్.. రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. కుక్కలను నియంత్రించాలని, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

మహిళలు క్రీడల్లో రాణించాలి



అభినందిస్తున్న బిజయ్‌కుమార్

జ్యోతినగర్: మహిళలు క్రీడల్లో రాణించాలని ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్ అన్నారు. బుధవారం ఎన్టీపీసీ పరిపాలనా భవనంలో జాతీయ క్రీడారత్న అవార్డు గ్రహీత జాగటి శాంతమ్మను ఆయన అభినందించారు. శాంతమ్మ ఎన్టీపీసీ పర్మినెంట్ ధన్వంతరి ఆస్పత్రిలో కాంట్రాక్టు కార్మికురాలుగా విధులు నిర్వహించడంతోపాటు పలు క్రీడాపోటీల్లో పాల్గొని జాతీయ అవార్డులు అందుకోవడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సీఎస్సార్ డీజీఎం ప్రశాంత్ శామ్యూల్, దీపక్ పాఠక్, వేముగంటి యుగంధర్ రావు తదితరులు పాల్గొన్నారు.



మర్రిలో తాటిచెట్టు

పెద్దపల్లి మండలం హన్మంతునిపేట సమ్మక్క – సారలమ్మ గద్దెల వద్ద మర్రిచెట్టులో ఓ తాటి చెట్టు పెరిగింది. దానినుంచి తాటికల్లు తీసేందుకు గీతకార్మికుడు నిచ్చెన వేసుకుని పైకి వెళ్తున్నాడు. మోకు సాయంతో చెట్టు ఎక్కి కల్లు తీస్తూ గీతకార్మికుడు బతుకు జీవుడా అంటున్నాడు.

– పెద్దపల్లిరూరల్